RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

PRABHATA GAMANAM ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 254 | సంపుటి 4 | ఆదివారం | 07-06-2026 | పేజీలు 4 | వెల 3/-

## ఎవరెంత ఏడ్చినా తెలంగాణ
# అభివృద్ధి ఆగదు

**ఎన్ని విమర్శలు వచ్చినా ట్రిపుల్ ఆర్ ఆగదు : సీఎం**



- కోహెడలో రూ.3,387 కోట్లతో అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ కు శంకుస్థాపన
- 239 ఎకరాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రైతులకు అత్యాధునిక మార్కెట్ నిర్మాణం
- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- రైతులు, వ్యాపారులకు ఒకేచోట అన్ని సౌకర్యాలు కల్పించేలా సమీకృత మార్కెట్ ఏర్పాటు
- ఆర్ ఆర్ ఆర్, ఫ్యూచర్ సిటీ, మెట్రో విస్తరణ వంటి ప్రాజెక్టులు తెలంగాణ భవిష్యత్తుకు కీలకమన్న సీఎం
- వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తున్నామని పేర్కొన్న రేవంత్ రెడ్డి
- క్వింటాలుకు రూ.500 బోనస్ తో రైతాంగానికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి
- ఆధునిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో ప్రజలకు మెరుగైన సేవలు

2

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రయాణాన్ని ఎవరూ అడ్డుకోలేరని, ఎవరెంత విమర్శించినా రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్), ఫ్యూచర్ సిటీ, మెట్రో విస్తరణ వంటి కీలక ప్రాజెక్టులు ఆగవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.3,387.35 కోట్ల అంచనా వ్యయంతో 239 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ తో పాటు ఆధునిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఆయన, తెలంగాణను ప్రపంచ స్థాయి వాణిజ్య, పారిశ్రామిక, పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు ఆధునిక మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన ధరలు అందించడం, ఉపాధి అవకాశాలు పెంచడం, మౌలిక వసతులను విస్తరించడం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నాలు ఎంత జరిగినా అవి విజయవంతం కావని స్పష్టం చేస్తూ, "ఎవరెంత ఏడ్చినా ఆర్ఆర్ఆర్ ఆగదు.. తెలంగాణ అభివృద్ధి ఆగదు" అని ముఖ్యమంత్రి ఘాటుగా వ్యాఖ్యానించారు. రైతాంగం, యువత, పెట్టుబడిదారులు, పారిశ్రామిక రంగం ఆశయాలకు అనుగుణంగా తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

— హైదరాబాద్, ప్రభాత గమనం




04

## వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- మరో రెండు రోజుల్లో రుతుపవనాలు :సీఎస్ రామకృష్ణారావు
- నీట్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు
- జూన్ 9 మహిళా సంఘాల సభకు ఆర్టీసీ బస్సుల సమన్వయంపై సమీక్ష

మరో రెండు రోజుల్లో నైరుతి రుతుపవనాలు తెలంగాణను తాకనున్న నేపథ్యంలో వరి కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే జూన్ 21న నిర్వహించనున్న నీట్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయడంతో పాటు జూన్ 9న మహిళా సంఘాల సభ్యుల సభకు ఆర్టీసీ బస్సుల సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

## డిప్యూటీ ఈవో పోస్టులకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్

హైదరాబాద్ జూన్ 06(ప్రభాత గమనం):

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుభవార్త అందించిం ది, స్కూల్ ఎడ్యుకేషన్ లో కొన్ని ఏళ్ల నుంచి ఖాళీగా ఉన్న డిప్యూ టీ ఎడ్యుకేషన్ ఆఫీ సర్స్ గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్ 1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24 గెజిటెడ్ స్థాయి పోస్టులను భర్తీ చేయనున్నట్లు టీజీపీ ఎస్సీ ప్రకటించింది. చాలాకాలంగా ఖాళీగా ఉన్న ఈ ఉన్నత స్థాయి పోస్టులను భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థల పని తీరును మెరుగుపర చాలని ప్రభుత్వం భావిస్తోంది. పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల అర్హతలకు సంబంధించి కమిషన్ స్పష్టమైన మార్గదర్శకా లను జారీ చేసింది. 2026 జులై 1 నాటికి అభ్యర్థుల వయస్సు తప్పనిసరిగా 18 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయస్సు 44 ఏళ్లుగా నిర్ణయించారు.

## మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ వివాదం

- రంగంలోకి జాతీయ ఎస్టీ కమిషన్
- ప్రాజెక్టుపై దర్యాప్తునకు ఆదేశం
- తెలంగాణ ప్రభుత్వం, మహబూబాబాద్ కలెక్టర్ కు నోటీసులు
- జీవో 98 రద్దు చేయాలంటూ జాతీయ కమిషన్ ను ఆశ్రయించిన 'తెలంగాణ విద్యావంతుల వేదిక'
- 30 రోజుల్లో నివేదిక ఇవ్వకుంటే సమన్లు తప్పవని హెచ్చరిక
- గిరిజన రైతుల పోరాటంలో ఇది తొలి విజయం : లాయర్ విశ్వజంపాల హర్షం

04




## కేసముద్రం మున్సిపాలిటీలో 'కో-ఆప్షన్' లొల్లి..

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారా?
- మున్సిపల్ కమిషనర్, పాలకవర్గం తీరుపై బీఆర్ఎస్ మండిపాటు
- తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని మహమ్మద్ నజీర్ అహ్మద్ డిమాండ్

3

కేసముద్రం, జూన్ 6 (ప్రభాత గమనం) :

కేసముద్రం మున్సిపాలిటీలో కో–ఆప్షన్ సభ్యుల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోవడంపై స్థానికంగా రాజకీయ దుమారం రేగుతోంది. మున్సిపాలిటీని కమిషనర్ తన సొంత సంస్థగా భావిస్తున్నారా? లేక పాలకవర్గం అలసత్వం వహిస్తోందా? అంటూ బిఆర్ఎస్ మండల పార్టీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను నెలల తరబడి జాప్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ములుగుకు ఓఆర్ఆర్




3

- రూ.50 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం
- జిల్లా కేంద్రం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు
- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమాలు
- ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి సీతక్క

ములుగు జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలో రూ.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# ఎవరెంత ఏడ్చినా తెలంగాణ అభివృద్ధి ఆగదు

## ఎన్ని విమర్శలు వచ్చినా ట్రిపుల్ ఆర్ ఆగదు : సీఎం

- కోహెడలో రూ.3,387 కోట్లతో అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ కు శంకుస్థాపన
- 239 ఎకరాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రైతులకు అత్యాధునిక మార్కెట్ నిర్మాణం
- ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- రైతులు, వ్యాపారులకు ఒకేచోట అన్ని సౌకర్యాలు కల్పించేలా సమీకృత మార్కెట్ ఏర్పాటు
- ఆర్ ఆర్ఆర్, ఫ్యూచర్ సిటీ, మెట్రో విస్తరణ వంటి ప్రాజెక్టులు తెలంగాణ భవిష్యత్తుకు కీలకమన్న సీఎం
- వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తున్నామని పేర్కొన్న రేవంత్ రెడ్డి
- క్వింటాలుకు రూ.500 బోనస్ తో రైతాంగానికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడి
- ఆధునిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో ప్రజలకు మెరుగైన సేవలు



**ప్రభాత గమనం, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరని, ఎవరెంత విమర్శించినా రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) సహా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఆగవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్, ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, రైతుల సంక్షేమం, ఉపాధి అవకాశాల కల్పన, ఆధునిక మౌలిక సదుపాయాల ఏర్పాటు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్న సీఎం, కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అయితే ప్రజల ఆకాంక్షల మేరకు చేపడుతున్న ప్రాజెక్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

### ప్రపంచ స్థాయి ఫ్రూట్ మార్కెట్‌కు శ్రీకారం

కోహెడలో 239 ఎకరాల విస్తీర్ణంలో రూ.3,387.35 కోట్ల అంచనా వ్యయంతో సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు తెలంగాణ వ్యవసాయ, వాణిజ్య రంగాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందన్నారు. ఈ మార్కెట్‌లో పండ్ల విక్రయ కేంద్రాలు, కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, గిడ్డంగులు, రవాణా సదుపాయాలు, ఎగుమతి కేంద్రాలు, పార్కింగ్ స్థలాలు, ఆధునిక వేలం వ్యవస్థలు వంటి సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. రైతులు తమ ఉత్పత్తులను నేరుగా మార్కెట్‌కు తీసుకువచ్చి మంచి ధరలు పొందేలా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ మార్కెట్ పూర్తయితే తెలంగాణ పండ్ల వ్యాపారానికి అంతర్జాతీయ గుర్తింపు లభించడమే కాకుండా, వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు.

### రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

గతంలో నగరంలోని పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించిన సమయంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను సీఎం గుర్తు చేశారు. అప్పట్లో తాత్కాలిక టెంట్లలో వ్యాపారం నిర్వహించాల్సి వచ్చిందని, గాలివానలు వచ్చినప్పుడు రైతులు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటు పలువురు గాయపడిన ఘటనలు కూడా జరిగాయని చెప్పారు. ఆ పరిస్థితులను చూసిన తర్వాత రైతులకు శాశ్వత పరిష్కారం కల్పించాలని నిర్ణయించుకున్నానని, అప్పట్లో ఎంపీగా ఇచ్చిన హామీని ఇప్పుడు ముఖ్యమంత్రిగా అమలు చేస్తున్నానని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఒకే చోట అందుబాటులో ఉండేలా ఈ మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

### అత్యాధునిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

రాష్ట్రంలోని అనేక రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం పేర్కొన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, వేచి ఉండే గదులు, పార్కింగ్ వంటి కనీస సదుపాయాలు కూడా లేని పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆధునిక ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రజలు గౌరవప్రదంగా సేవలు పొందే విధంగా అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలంటే అంతర్జాతీయ ప్రమాణాల మౌలిక వసతులు అవసరమని అభిప్రాయపడ్డారు.

### ఎవరెంత ఏడ్చినా ఆర్ఆర్ఆర్ ఆగదు

రాష్ట్రంలో జరుగుతున్న భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులపై వస్తున్న విమర్శలకు స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. "ఎవరెంత ఏడ్చినా ఆర్ఆర్ఆర్ ఆగదు.. అభివృద్ధి ఆగదు" అని స్పష్టం చేశారు. తెలంగాణ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రహదారులు, పారిశ్రామిక కారిడార్లు, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర ప్రగతికి ఎంతో కీలకమని వివరించారు. రాష్ట్రాన్ని పెట్టుబడులకు అనువైన కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఆర్ఆర్ఆర్ కీలక పాత్ర పోషిస్తుందని, భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టులను చేపడుతున్నామని పేర్కొన్నారు.

### వ్యవసాయం దండగ కాదు.. పండగ

వ్యవసాయ రంగానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సీఎం తెలిపారు. రైతులకు వరి పంటపై క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని గుర్తు చేశారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. దేశంలోనే అత్యధిక వరి ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, రైతులు కష్టపడి పండించిన ప్రతి గింజకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వ్యవసాయం నష్టాల రంగం కాదని, సరైన ప్రణాళికతో సాగు చేస్తే లాభదాయకమైన రంగమని నిరూపిస్తున్నామని అన్నారు.

### కాళేశ్వరం పేరుతో దుష్ప్రచారం

తెలంగాణ రైతులు సాధిస్తున్న విజయాలను కొందరు రాజకీయంగా వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని సీఎం విమర్శించారు. రైతులు ఏ పంట పండించినా దానికి కారణం కేవలం గత ప్రభుత్వమేనన్న ప్రచారం చేయడం సరికాదన్నారు. రాష్ట్ర రైతుల కష్టం, ప్రభుత్వ ప్రోత్సాహక విధానాల వల్లే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. రైతులకు మెరుగైన ధరలు, బోనస్‌లు, కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

### కూరగాయల ధరలు పెరగడానికి ఇదే కారణం

ఒకప్పుడు హైదరాబాద్ నగరానికి అవసరమైన కూరగాయలు, పాలు, పండ్లు రంగారెడ్డి జిల్లా నుంచే పెద్ద ఎత్తున వచ్చేవని సీఎం గుర్తు చేశారు. ఓఆర్ఆర్, విమానాశ్రయం నిర్మాణం తర్వాత భూముల విలువలు పెరగడంతో వ్యవసాయ భూములు తగ్గిపోయాయని తెలిపారు. రైతులు పరిమితంగా వరి, పత్తి, మిర్చి వంటి పంటల సాగుపై దృష్టి పెట్టడంతో కూరగాయల ఉత్పత్తి తగ్గిందని, ఫలితంగా ధరలు పెరుగుతున్నాయని చెప్పారు. ఉద్యానవన పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.

### ఫ్యూచర్ సిటీతో తెలంగాణకు కొత్త గుర్తింపు

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. ప్రపంచ స్థాయి కంపెనీలను తెలంగాణకు ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 500కు పైగా ప్రముఖ సంస్థలను తెలంగాణకు తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వెల్లడించారు. దీనివల్ల లక్షలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయని పేర్కొన్నారు.

### యువతకు భారీగా ఉద్యోగాలు

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని సీఎం తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ భారీగా ఉద్యోగాలు వచ్చేలా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ యువత దేశంలోనే అత్యుత్తమ అవకాశాలు పొందేలా కృషి చేస్తున్నామని అన్నారు.

### సీఎం పర్యటనతో ట్రాఫిక్ ఆంక్షలు

ఇదిలా ఉండగా, సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు కోహెడ-హయత్‌నగర్ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సంఘీ నుంచి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ద్విచక్రవాహనదారులు, ప్రయాణికులు కొంతసేపు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్‌ను మళ్లించడంతో పలుచోట్ల రాకపోకలు మందగించాయి. అధికారులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

# వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- మరో రెండు రోజుల్లో రుతుపవనాలు..
- సీఎస్ రామకృష్ణారావు
- నీట్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- జూన్ 9 మహిళా సంఘాల సభకు ఆర్టీసీ బస్సుల సమన్వయంపై సమీక్ష



**హనుమకొండ, జూన్ 6(ప్రభాత గమనం):**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు కీలక అంశాలపై సమీక్షించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### నీట్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

ఈ సందర్భంగా జూన్ 21న నిర్వహించనున్న నీట్ పరీక్ష ఏర్పాట్లపై సీఎస్ ఆరా తీశారు. జిల్లాలో పరీక్ష నిర్వహణకు అన్ని విధాలుగా పటిష్ట చర్యలు చేపడతామని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో నిర్వహించిన పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన అనుభవంతో ఈసారి కూడా సమర్థవంతంగా పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్షల పర్యవేక్షణ కోసం రూట్ ఆఫీసర్లు, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించనున్నట్లు వివరించారు.

### వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి

రుతుపవనాలు సమీపిస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి తరలించేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశమై ఈనెల 9న హైదరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న మహిళా సంఘాల సభ్యుల సభకు సంబంధించి ఏర్పాట్లపై సూచనలు చేశారు. జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు ఆర్టీసీ బస్సుల ద్వారా సకాలంలో సభా ప్రాంగణానికి చేరుకునేలా సమన్వయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా యువజన, క్రీడాధికారి కొత్త ప్రశాంత్, హనుమకొండ ఏసీపీ నరసింహారా వు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మహ్మద్ వాజీద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, అడిషనల్ డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు, గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థ నాయక్, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, నీట్ ఎగ్జామ్ జిల్లా కోఆర్డినేటర్ భిక్షపతి తదితర అధికారులు పాల్గొన్నారు.






# గ్రామాభివృద్ధి, పిల్లల రక్షణలో బాల పంచాయతీల పాత్ర కీలకం

- డీసీపీ ధార కవిత
- వంగపహాడ్ జడ్పీహెచ్ ఎస్ లో బాల పంచాయతీ కార్యక్రమం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

గ్రామాభివృద్ధి మరియు పిల్లల రక్షణలో బాల పంచాయతీలు కీలక భూమిక పోషిస్తాయని వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత అన్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా, తెలంగాణ స్టేట్ విమెన్ సేఫ్టీ వింగ్ సూచనల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపాడు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బాల పంచాయతీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ ధార కవిత మాట్లాడారు. పిల్లల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, వారి సమస్యలను వారే గుర్తించి పరిష్కార మార్గాలను సూచించేలా చేయడం బాల పంచాయతీల ప్రధాన ఉద్దేశమని ఆమె తెలిపారు. పోలీసు శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాల పంచాయతీ సభ్యులు తమ గ్రామం, పాఠశాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. పిల్లలు గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. భవిష్యత్తులో గ్రామాభివృద్ధి, పిల్లల సంక్షేమం, పాఠశాల అభివృద్ధిలో బాల పంచాయతీల పాత్ర మరింత పెరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బాల పంచాయతీకి ఎన్నికైన విద్యార్థులను అభినందించి, డీసీపీ చేతుల మీదుగా వారికి బ్యాడ్జిలు అందజేశారు. బాల పంచాయతీ కార్యక్రమాల నమోదు కోసం రూపొందించిన రిజిస్టర్ బుక్‌లెట్‌ను కూడా ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న విమెన్ సేఫ్టీ వింగ్ హైదరాబాద్ డీఎస్పీ ఎర్నా మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పైలట్ ప్రాజెక్టు కింద ఎనిమిది గ్రామాల్లో బాల పంచాయతీలను ప్రారంభించినట్లు తెలిపారు. పిల్లలు గుర్తించిన ప్రతి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మై ఛాయిసెస్ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ జన్ను క్రాంతి, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ జాన్ నరసింహులు, సీఐ మహేందర్, ఎస్సై రవి, సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర్, షీ టీమ్ ఎస్సై స్వాతి, ఎంఈఓ శ్రీనివాస్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్సై సుధాకర్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# సర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, జూన్ 6 (ప్రభాత గమనం):**

జిల్లాలో కొనసాగుతున్న సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భూ రికార్డులు, భూ కొలతల శాఖ అధికారులు, సర్వేయర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ వివిధ సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వ, పట్టా భూముల హద్దుల నిర్ధారణ, గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించిన సర్వే, రీ-సర్వే కార్యక్రమాలు, చెరువుల శిఖం (వెట్‌ల్యాండ్స్) భూముల గుర్తింపు, కొలతలు తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రత్యేకంగా చెరువు శిఖం భూముల సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జానకీపురం, ముచ్చర్ల గ్రామాల్లో కొనసాగుతున్న రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసి పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ఆదేశించారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో సర్వే కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న కలెక్టర్, ఖచ్చితత్వంతో కూడిన సర్వే నిర్వహణ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చన్నారు. ప్రతి కేసును బాధ్యతాయుతంగా పరిశీలిస్తూ నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో భూ రికార్డులు, భూ కొలతల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నూర్ సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు సారంగపాణి, రాజనర్సయ్య పాల్గొన్నారు.

# భాగ్యనగరంపై వరుణుడి కరుణ

- హైదరాబాద్ లో పలుచోట్ల వర్షాలు.. ఎండల నుంచి ఉపశమనం
- మరో రెండు రోజుల్లో తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు

**ప్రభాత గమనం, హైదరాబాద్ :**

భానుడి భగభగలతో అల్లాడుతున్న హైదరాబాద్ నగరానికి వరుణుడు ఊరటనిచ్చాడు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, ఎస్ఆర్‌నగర్, యూసఫ్‌గూడ, ఎల్‌బీనగర్, హయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. హైదర్‌గూడ, ఉప్పరపల్లి ప్రాంతాల్లో భారీ వర్షం నమోదైంది. వర్షం కారణంగా మెహదీపట్నం, మాసబ్‌ట్యాంక్, విజయనగర్ కాలనీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నెమ్మదించింది. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు నైరుతి రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతాన్ని తాకాయి. మరో రెండు రోజుల్లో తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.




# ములుగుకు ఓఆర్ఆర్

- రూ.50 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం
- జిల్లా కేంద్రం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు
- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమాలు
- ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి సీతక్క

**ములుగు, జూన్ 6 (ప్రభాత గమనం):**

ములుగు జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలో రూ.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అక్కడి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పెరుగుతున్న జనాభా, వ్యాపార అవసరాలను దృష్టిలో ఉంచుకుని ములుగు జిల్లా కేంద్రంలో డబుల్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. అలాగే భవిష్యత్తు అవసరాల కోసం ములుగు పట్టణం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఏర్పాటు చేయడానికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఓఆర్ఆర్ నిర్మాణం ద్వారా ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు జిల్లా అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.




## కేసముద్రం మున్సిపాలిటీలో 'కో-ఆప్షన్' లొల్లి

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారా?
- మున్సిపల్ కమిషనర్, పాలకవర్గం తీరుపై బీఆర్ఎస్ మండిపాటు
- తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని మహమ్మద్ నజీర్ అహ్మద్ డిమాండ్

**కేసముద్రం, జూన్ 6 (ప్రభాత గమనం) :**

కేసముద్రం మున్సిపాలిటీలో కో–ఆప్షన్ సభ్యుల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోవడంపై స్థానికంగా రాజకీయ దుమారం రేగుతోంది. మున్సిపాలిటీని కమిషనర్ తన సొంత సంస్థగా భావిస్తున్నారా? లేక పాలకవర్గం అలసత్వం వహిస్తోందా? అంటూ బిఆర్ఎస్ మండల పార్టీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను నెలల తరబడి జాప్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న కో–ఆప్షన్ సభ్యుల భర్తీ కోసం అధికారులు గతంలో అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులందరూ మున్సిపల్ కార్యాలయంలో తమ అప్లికేషన్లను కూడా సమర్పించారు. అయితే, దరఖాస్తులు స్వీకరించి ఇన్ని రోజులవుతున్నా, తదుపరి ప్రక్రియను చేపట్టడంలో మున్సిపల్ అధికారులు, పాలకవర్గం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి."ఒక నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత ప్రజాస్వామ్య పద్ధతిలో దానిని అమలు పరచాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ కేసముద్రం మున్సిపాలిటీలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. అప్లికేషన్లు తీసుకుని ఇన్ని రోజులైనా ఎన్నికలు జరపకపోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటి?"ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి అలసత్వం శోచనీయమని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహమ్మద్ నజీర్ అహ్మద్ మండిపడ్డారు. నోటిఫికేషన్ అమలుకు ఎన్ని రోజులు పడుతుందో మున్సిపల్ కమిషనర్, పాలకవర్గం ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాలయాపన చేస్తూ ఎన్నికలను వాయిదా వేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.మున్సిపల్ కమిషనర్ తక్షణమే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. నిలిచిపోయిన కో–ఆప్షన్ సభ్యుల ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడి, అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని వీడి త్వరగా ఎన్నికలు నిర్వహించకపోతే, బిఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- వ్యవసాయం, మహిళా భద్రత, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత
- ఘనంగా 'ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక' వార్డు సభలు

**కేసముద్రం, జూన్ 06(ప్రభాత గమనం):**

ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించి, కేసముద్రం మున్సిపాలిటీని ప్రగతి పథంలో నడిపించడమే తమ ప్రధాన ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ బానోత్ సునీత స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం కేసముద్రం మున్సిపాలిటీలో వార్డు సభలను అత్యంత ఘనంగా నిర్వహించారు.మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వార్డు 1, 11, 12, 13 సభలకు చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విలేజ్ కేసముద్రం పరిధిలోని 7, 8, 9, 10, 16 వార్డుల సభల్లో చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్‌పర్సన్ అల్లం రామ సంయుక్తంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు ప్రజలనుద్దేశించి.......రైతు సోదరులు సాంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి, మారుతున్న కాలానికి అనుగుణంగా పంట మార్పిడి పద్ధతులను అవలంబించాలని చైర్‌పర్సన్ సూచించారు. దీనివల్ల భూసారం పెరగడమే కాకుండా మున్ముందు మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.మహిళల రక్షణ, ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చైర్‌పర్సన్ పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు.త్వరలోనే వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో వార్డుల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వార్డుల్లో డ్రైనేజీలు, సైడ్ డ్రెయిన్ల పూడికతీత, రోడ్లు మరియు వీధి దీపాల సమస్యలు ఉంటే స్థానిక కౌన్సిలర్ల ద్వారా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. మున్సిపల్ ప్రజల అవసరాలకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా ప్రజలకు భరోసా ఇచ్చారు.ఈ వార్డు సభల కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. శ్రీనివాసరావుతో పాటు వార్డు కౌన్సిలర్లు వీరేష్, కిషోర్, భారతి, సుభద్ర, విజయ, ఉమా, వినయ్, రాము, కృష్ణ, సునీత, శారద పాల్గొన్నారు.వీరితో పాటు విద్యా, వ్యవసాయ, వైద్య, పోలీస్, పట్టణాభివృద్ధి, రెవెన్యూ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఆర్పీలు రైతులు, మహిళలు పాల్గొన్నారు.




## గార్లలో ఘనంగా బలరాం నాయక్ జన్మదిన వేడుకలు

- నెహ్రూ కూడలిలో కేక్ కట్ చేసిన కాంగ్రెస్ శ్రేణులు

**గార్ల, జూన్ 6 (ప్రభాత గమనం):**

మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు, మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాం నాయక్ జన్మదిన వేడుకలు గార్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి. స్థానిక నెహ్రూ కూడలిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దనియకుల రామారావు అధ్యక్షతన శ్రేణులంతా ఒకచోటికి చేరి కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు.ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావూరి వెంకటరామయ్య, సూరారం రెడ్డి, వెంకట్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బలరాం నాయక్ గతంలో కేంద్ర మంత్రిగా, ఎంపీగా ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. గార్ల మండల ప్రగతిలో ఆయన పోషించిన పాత్ర అద్వితీయమని కొనియాడారు.ఎంపీ బలరాం నాయక్ నాయకత్వంలో గార్ల మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్యకర్తలందరూ ఐక్యమత్యంతో ముందుకు సాగి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ నియోజకవర్గ స్థాయి వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు మాలోత్ వెంకట్లాల్, గుండా వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు శివాజీ, శ్రీనివాస్, జిల్లా నాయకులు బాపనపల్లి సుందర్, గుగులోతు శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే స్థానిక సర్పంచులు బాధావత్ రవి, గుగులోతు రమేష్, అజ్మీర బాబురావు, ప్రమీల బాధావత్, ప్రసాద్‌లతో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, బలరాం నాయక్ అభిమానులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే కు తప్పిన ప్రమాదం

**బిక్కనూర్ జూన్ 6(ప్రభాత గమనం):**



నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తకు త్రుటిలో ప్రమాదం తప్పింది. మాజీ ఎమ్మెల్యే హైదరాబాద్ నుండి నిజామాబాద్ వెళ్తుండగా బిక్కనూర్ మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారులో తన కారును వెనుక నుండి వస్తున్న లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యేను పరామర్శించి వేరే కారులో నిజామాబాద్ పంపించారు.

## గూడూరు మండలంలో విస్తృత నాకాబందీ తనిఖీలు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




మహబూబాబాద్ జిల్లా ఎస్పి డాక్టర్ శబరీష్, ఆదేశాల మేరకు, డీఎస్పీ తిరుపతి రావు పర్యవేక్షణలో గూడూరు సర్కిల్ పరిధిలో ప్రత్యేక నాకాబందీ కార్యక్రమం నిర్వహించబడింది. గూడూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని మూడు ప్రధాన మార్గాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గూడూరు సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు చెందిన వివిధ హోదాల 32 మంది పోలీసు సిబ్బంది, నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్‌తో కలిసి పాల్గొన్నారు. నాకాబందీ సందర్భంగా సుమారు 120 వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, నంబర్ ప్లేట్లు లేని 09 వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించి తదుపరి చర్యలు చేపట్టారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, అక్రమ రవాణా మరియు అనుమానాస్పద వస్తువుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా బీసీఎం డిపో బస్సులను సైతం పూర్తిగా తనిఖీ చేయగా ఎటువంటి అనుమానాస్పద పదార్థాలు గుర్తించబడలేదు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, ప్రజలు ఇటువంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసు అధికారులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. గూడూరు మండలాన్ని గంజాయి రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు పోలీసు శాఖ నిరంతరం ప్రత్యేక చర్యలు కొనసాగిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.

## మహిళల భద్రతే ప్రధాన లక్ష్యం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- పెండ్యాల గ్రామసభలో పాల్గొన్న సీపీ

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహిళల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో శనివారం ధర్మసాగర్ మండలం పెండ్యాల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడిన సీపీ, మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని, తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి ఆత్మస్థైర్యం, పట్టుదల అవసరమని పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం షీ టీమ్స్ సమర్థవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురైతే మౌనంగా ఉండకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పిల్లలకు ఉన్నత విద్య అందించడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, కుటుంబం మరియు సమాజ అభివృద్ధికి మహిళల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై కూడా ఆయన అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ధర్మసాగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రావు, సర్పంచ్, రెవెన్యూ అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



# మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ వివాదం

- రంగంలోకి జాతీయ ఎస్టీ కమిషన్
- ప్రాజెక్టుపై దర్యాప్తునకు ఆదేశం
- తెలంగాణ ప్రభుత్వం, మహబూబాబాద్ కలెక్టర్ కు నోటీసులు
- జీవో 98 రద్దు చేయాలంటూ జాతీయ కమిషన్ ను ఆశ్రయించిన 'తెలంగాణ విద్యావంతుల వేదిక'
- 30 రోజుల్లో నివేదిక ఇవ్వకుంటే సమన్లు తప్పవని హెచ్చరిక
- గిరిజన రైతుల పోరాటంలో ఇది తొలి విజయం :లాయర్ విశ్వ జంపాల హర్షం



**గార్ల,జూన్ 6 (ప్రభాత గమనం) :**

ప్రతిపాదిత మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ ప్రాజెక్టు వివాదం ఇప్పుడు దేశ రాజధానికి చేరింది. ఈ ప్రాజెక్టు వల్ల స్థానిక ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన జనాభాకు, వారి భూములకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్న ఫిర్యాదుపై జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (NCST) అత్యంత ప్రాధాన్యతతో స్పందించింది. ప్రాజెక్టుపై పూర్తి స్థాయి దర్యాప్తునకు ఆదేశిస్తూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, మహబూబాబాద్ జిల్లా యంత్రాంగానికి కీలక నోటీసులు జారీ చేసింది.ఈ పరిణామంపై తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది విశ్వ జంపాల హర్షం వ్యక్తం చేశారు. శనివారం గార్ల మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, రైతులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు.గిరిజనుల హక్కులను కాలరాస్తూ, వారి అభిప్రాయాలను తీసుకోకుండా తెచ్చిన జీవో నెంబర్ 98ని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ గత ఏప్రిల్ 16న విశ్వ జంపాల స్థానిక గిరిజన రైతులతో కలిసి జాతీయ ఎస్టీ కమిషన్‌కు సమగ్రమైన పిటిషన్ సమర్పించారు. దీన్ని స్వీకరించిన కమిషన్ (ఫైల్ నెం. NCST/DEV-7762/TS/1402 /2026-RO-BHUV/RU-III), భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 338A ప్రకారం దర్యాప్తునకు ఆదేశిస్తూ ఆదేశాలు జారీ చేసింది.తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ & డైరెక్టర్‌తో పాటు, మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌కు నోటీసులు పంపిన కమిషన్.. క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికను 30 రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించింది.నిర్ణీత గడువులోగా సరైన సమాధానం లేదా నివేదిక రానట్లయితే, సివిల్ కోర్టు అధికారాల ప్రకారం అధికారులకు సమన్లు జారీ చేసి.. ఢిల్లీ లేదా ప్రాంతీయ కార్యాలయానికి వ్యక్తిగతంగా హాజరుపరుస్తామని కమిషన్ హెచ్చరించింది."స్థానిక గిరిజన, ఆదివాసీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా చట్ట విరుద్ధంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. దీనివల్ల వందలాది ఏజెన్సీ గిరిజన కుటుంబాలు భూములు కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉంది. ఈ అనాలోచిత ప్రాజెక్టుపై జాతీయ కమిషన్ స్పందించడం బాధితులకు దక్కిన తొలి విజయం. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం మొండి వైఖరి వీడి జీవో 98ని రద్దు చేయాలి.రాబోయే రోజుల్లో గిరిజనుల జల్-జంగల్-జమీన్ (నీరు, అడవి, భూమి) హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో న్యాయ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని విశ్వ జంపాల స్పష్టం చేశారు. గిరిజనుల గొంతుకకు రాష్ట్రంలోని మీడియా సంస్థలు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు ఏకతాటిపైకి వచ్చాయి. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు & మున్నేరు జలసాధన కమిటీ కన్వీనర్ గంగావత్ లక్ష్మణ్ నాయక్, సిపిఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి గుగులోత్ సక్రు, సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, రైతు సంఘం నాయకులు కత్తి సత్యం, పల్లెబోయిన లింగయ్యతో పాటు వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు భూక్యా హరి నాయక్, అంబటి వీరస్వామి, బాదావత్ చంటి, జనార్ధన్, మీగడ శ్రీనివాస్, అశోక్, శ్యామ్, రాజేంద్రప్రసాద్, శేరిపురం మాజీ సర్పంచ్ సక్రు తదితరులు పాల్గొని ప్రాజెక్టు బాధితులకు పూర్తి సంఘీభావం ప్రకటించారు.



# నకిలీ విత్తనాలు, పురుగుమందుల విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

- వ్యవసాయాధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాలి
- సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూక్య రవి నాయక్

**బయ్యారం, జూన్ 6 (ప్రభాత గమనం):**

ప్రభుత్వాలు ప్రతి సమావేశంలోనూ "రైతే రాజు" అని గొప్పలు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం అన్నదాతలు ప్రతి ఏటా పంట నష్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూక్య రవి నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. బయ్యారంలో శనివారం జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్కెట్లో లభిస్తున్న నాణ్యతలేని విత్తనాలు, నకిలీ పురుగుమందుల కారణంగానే రైతులు కోలుకోలేని విధంగా ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.ఇకనైనా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించే ప్రతి దుకాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా అమలు అయ్యేలా చూడాలని రవి నాయక్ డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు కేవలం నామమాత్రంగా కాకుండా, ప్రతి మండల పరిధిలోని అన్ని దుకాణాలను క్రమం తప్పకుండా, ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఒకవేళ ఏ దుకాణంలోనైనా నాణ్యతలేని గింజలు లేదా నకిలీ మందులు విక్రయించినట్లు తేలితే, ప్రజలను మరియు రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు."దేశ ప్రజలందరికీ అన్నం పెట్టే రైతును మోసం చేయడం అత్యంత దుర్మార్గమైన పని. రైతు బతికితేనే దేశం బతుకుతుంది. కాబట్టి వ్యాపారులు లాభాపేక్ష పక్కనబెట్టి రైతులకు నాణ్యమైన సరుకులు అందించాలి.ఇదే సమయంలో రైతులు కూడా విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కొనుగోలుకు ముందే విత్తనాల నాణ్యతను పూర్తిగా పరిశీలించుకోవాలని, గుర్తింపు పొందిన దుకాణాల్లోనే బిల్లులతో సహా కొనుగోలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన ప్రతినిధులు అజ్మీర శ్రీకాంత్ నాయక్, జాటోతు రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# డిప్యూటీ ఈవో పోస్టులకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్

**హైదరాబాద్ జూన్ 06(ప్రభాత గమనం):**

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుభవార్త అందించిం ది, స్కూల్ ఎడ్యుకేషన్ లో కొన్ని ఏళ్ల నుంచి ఖాళీగా ఉన్న డిప్యూ టీ ఎడ్యుకేషన్ ఆఫీ సర్స్ గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్ 1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24 గెజిటెడ్ స్థాయి పోస్టులను భర్తీ చేయనున్నట్లు టీజీపీ ఎస్సీ ప్రకటించింది. చాలాకాలంగా ఖాళీగా ఉన్న ఈ ఉన్నత స్థాయి పోస్టులను భర్తీ చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, విద్యా సంస్థల పని తీరును మెరుగుపరచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నియామకాలు విద్యా వ్యవస్థలో క్షేత్ర స్థాయి పర్యవేక్షణను పటిష్ఠం చేయడానికి ఎంతగానో దోహదప డతాయని విద్యా రంగ నిపుణులు చెబుతు న్నారు.ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల అర్హతలకు సంబంధించి కమిషన్ స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. 2026 జులై 1 నాటికి అభ్యర్థుల వయస్సు తప్పనిసరిగా 18 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయస్సు 44 ఏళ్లుగా నిర్ణయించారు.



# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ మండల కార్యదర్శి జల్లే జయరాజు
- తహసీల్దార్ కార్యాలయంలో మెమొరాండం అందజేత
- రూ. 26వేల కనీస వేతనం, 'పీఎం శ్రీ' కేంద్రాల రద్దుకై నినాదం

**కేసముద్రం, జూన్ 06 (ప్రభాత గమనం) :**

తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కేసముద్రం మండల కేంద్రంలో అంగన్‌వాడీలు శనివారం నిరసన చేపట్టారు. మండల తహసిల్దార్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ రాకేష్‌కు పలు కీలక డిమాండ్లతో కూడిన మెమొరాండాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జల్లే జయరాజు మాట్లాడుతూ..దశాబ్దాలుగా సేవలందిస్తున్న అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు గత 50 సంవత్సరాలుగా పేద ప్రజలకు నిరంతర సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. వీరిలో అత్యధికులు మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే ఉన్నారని, నేటికీ వీరికి ఎలాంటి చట్టబద్ధమైన సౌకర్యాలు లేకపోవడం శోచనీయమన్నారు. పాలకులు మారుతున్నా అంగన్‌వాడీల జీవితాల్లో మార్పు రావడం లేదని, చాలీచాలని వేతనాలతో శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు."ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలకు రూ. 18 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఆ హామీలు నెరవేరలేదని తెలిపారు."-ప్రైమరీ, పీఎం శ్రీ కేంద్రాల నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని అన్నారు. ఆ కేంద్రాల బాధ్యతలను అంగన్‌వాడీలకే అప్పగిస్తూ జీవో నంబర్ 14ను సవరించాలన్నారు.అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల ప్రకారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ కు నెలకు రూ. 26,000 కనీస వేతనం చెల్లించాలని తెలిపారు.ప్రతి నెల 1వ తారీఖున వేతనాలు చెల్లించడంతో పాటు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని సూచించారు.సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ సౌకర్యాన్ని వర్తింపజేయాలన్నారు.కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆదేశాల ప్రకారం అంగన్‌వాడీలకు బిఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలని, ఐసిడిఎస్ కు సంబంధం లేని అదనపు పనులు చేయించకూడదని తెలిపారు.2017 నుండి పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ , ఇంక్రిమెంట్లు, ఇన్‌ఛార్జ్ అలవెన్స్ బకాయిలను వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే విడుదల చేయాలని తెలిపారు.24 రోజుల సమ్మె ఒప్పందం ప్రకారం.. ఈ మధ్య కాలంలో మరణించిన అంగన్‌వాడీల కుటుంబాలకు రూ. 2 లక్షల ప్రమాద బీమా డబ్బులు చెల్లించాలన్నారు. మంత్రిగారి హామీ ప్రకారం కారుణ్య నియామకాలను వేగవంతం చేయాలన్నారు.రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను ఒకేసారి భర్తీ చేయాలని తెలిపారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, లేనిపక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.కే. సలీమా, కొమ్ము రజిని తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎంపీ బలరాం నాయక్ పుట్టినరోజు వేడుకలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు
- అభిమాన నాయకుడి పుట్టినరోజును పండుగలా జరిపిన మండల పార్టీ

**కేసముద్రం, జూన్ 06(ప్రభాత గమనం):**

మాజీ కేంద్ర మంత్రి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) పోరిక బలరాం నాయక్ జన్మదిన వేడుకలు కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో శనివారం ఘనంగా జరిగాయి. కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరై, పార్టీ ముఖ్య నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. తమ అభిమాన నాయకుడు బలరాం నాయక్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.ఈ జన్మదిన వేడుకల్లో నియోజకవర్గ, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లా ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ రావుల మురళి, పీసీసీ సభ్యులు దస్రు నాయక్,కౌన్సిలర్ తరాల వీరేష్ యాదవ్, మాజీ ఉపసర్పంచ్ బానోత్ వెంకన్న, మాజీ సర్పంచ్ సాంబయ్య,బండారు దయాకర్, నీలం దుర్గేష్ ముదిరాజ్, అంబటి మహేందర్ రెడ్డి, ఎండి అయూబ్ ఖాన్, పోలేపాక నాగరాజు, కనుకుల రాంబాబు, పోలపల్లి వెంకటరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు నరేటి కొమరయ్య, రాజులపటి మల్లయ్య, పార్టీ శ్రేణులు సామ సుధాకర్, ముల భూలోక రెడ్డి, బానోత్ బాలు నాయక్, చేడుపెల్లి ఎలందర్, ఎండి తాజోద్దీన్, రషీద్ ఖాన్, నయీమ్, శ్రీహరి, గోలపల్లి మహేందర్, ముజ్జు షేక్, శ్రీరామ్ కిరణ్, బాలు, రాపోలు శ్రీనివాస్, బాదావత్ సుమన్, గుల్లేపెల్లి రాజేష్, ఎండి రఫీ, కాత్రేవుల హరికృష్ణ, ఎండి సమీర్, ఎండి రియాజ్, ఎండి నూరుద్దీన్, యకత చారి, శ్రీను, కళాధర్, ఉప్పునూతల శ్రీను, మదర్, తండా వెంకటేశ్వర్లు సహా పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.25 వేల విరాళం

- యాదవుల ఆరాధ్య దైవం ఆలయ అభివృద్ధికి మాలోత్ నెహ్రూ నాయక్ చేయూత

**డోర్నకల్, జూన్ 6 (ప్రభాత గమనం):**

డోర్నకల్ పట్టణంలోని యాదవుల ఆరాధ్య దైవం శ్రీ గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులకు రాష్ట్ర ఫైనాన్స్ సభ్యుడు మాలోత్ నెహ్రూ నాయక్ రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందించి తన సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధుల సేకరణలో భాగంగా ఈ విరాళాన్ని డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాలా సుమేర్ జైన్ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాలోత్ నెహ్రూ నాయక్ మాట్లాడుతూ, గంగమ్మ తల్లి ఆలయం యాదవ సమాజానికి ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందని, ఆలయ నిర్మాణం పూర్తి కావడం ద్వారా భక్తులకు మరింత సౌకర్యాలు కలుగుతాయని అన్నారు. సమాజ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని పేర్కొన్నారు. యాదవ సంఘ నాయకులు మాట్లాడుతూ, ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించిన మాలోత్ నెహ్రూ నాయక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవా కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొంటూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణం త్వరగా పూర్తై భక్తులకు అందుబాటులోకి రావాలని అందరూ ఆకాంక్షించారు.



Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABAD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374